## క్లుప్తంగా

### నేడు గడప గడపకు మన ప్రభుత్వం

పుల్లలచెరువు: మండల కేంద్రం పుల్లలచెరువు సచివాలయం–1 పరిధిలో శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీవో మరియదాసు తెలిపారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పాల్గొని ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ లబ్ధిని వివరిస్తారని చెప్పారు. కార్యక్రమంలో అధికారులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

### ప్రధాన మంత్రి బీమాపై అవగాహన

దర్శి: ప్రధాన మంత్రి జీవన జ్యోతి బీమా పథకం ప్రతి ఒక్కరూ ఉపయోగించుకోవాలని రాజంపల్లి ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ మేనేజర్ బి. పూర్ణచంద్రిక అన్నారు. రాజంపల్లిలో జీవనజ్యోతి, సురక్షా బీమా పథకాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పథకాలతో లబ్ధి పొందిన ఖాతాదారులకు రూ.4 లక్షల చెక్కు అందజేశారు. డ్వాక్రా మహిళలు, గ్రామస్తులు పాల్గొన్నారు.

### రేపు ఆదర్శ పాఠశాల ప్రవేశ పరీక్ష

ముండ్లమూరు: స్థానిక ఆదర్శ పాఠశాలలో ఆరో తరగతి ప్రవేశం కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న విద్యార్థులకు ఈ నెల 11వ తేదీన పరీక్ష నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ కల్లూరి పూర్ణచంద్రరావు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి పరీక్ష ప్రారంభమవుతుందన్నారు. పరీక్షకు హాజరయ్యే విద్యార్థులు ఆన్‌లైన్ దరఖాస్తుకి సంబంధించిన హాల్ టికెట్‌ను వెబ్‌సైట్ నుంచి డౌన్‌లోడ్ చేసుకొని తీసుకు రావాలన్నారు. శనివారం ఉదయం 10 గంటలకు పరీక్ష ఎలా రాయాలనే విషయంపై స్థానిక పాఠశాలలో అవగాహనా కార్యక్రమం ఉంటుందని చెప్పారు.

### తాళ్లూరు తహసీల్దార్‌గా కేవీ ప్రసాద్

తాళ్లూరు: తాళ్లూరు తహసీల్దార్‌గా కేవీ ప్రసాద్ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. ఒంగోలు కలెక్టర్ కార్యాలయంలో పనిచేస్తున్న కేవీ ప్రసాద్ బదిలీపై తాళ్లూరు వచ్చారు. తాళ్లూరు తహసీల్దార్ రామ్మోహన్‌రావు నెల్లూరు జిల్లాకు బదిలీపై వెళ్లారు.

### పుల్లలచెరువులో అగ్నిప్రమాదం

పుల్లలచెరువు: స్థానిక తిరుపతమ్మ ఆలయం సమీపంలోని ఓ ఇంట్లో గురువారం రాత్రి అగ్ని ప్రమాదం జరిగింది. ఎండా కాలం కావడంతో ఇంట్లోని కుటుంబ సభ్యులంతా ఆరుబయట నిద్రిస్తున్న సమయంలో గ్యాస్ లీకై రేకుల షెడ్డులో మంటలు చెలరేగాయి. ఇంట్లో ఉన్న ఫ్రిజ్, ఇతర వస్తువులు పూర్తిగా కాలిపోయాయి. ప్రమాదంలో సుమారు లక్షన్నర రూపాయల ఆస్తి నష్టం జరిగినట్లు యజమాని సంగబోయిన ఆంజనేయులు ఆవేదన వ్యక్తం చేస్తున్నాడు..

### కౌలుదారులకు వెన్నుదన్నుగా ప్రభుత్వం

తాళ్లూరు: కౌలు రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటోందని వ్యవసాయాధికారి ప్రసాదరావు తెలిపారు. రైతు భరోసా కేంద్రంలో శుక్రవారం మండల స్థాయి వ్యవసాయ సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి ప్రసాదరావు మాట్లాడుతూ కౌలు రైతులు, భూహక్కుదారుల హక్కులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా క్రాప్ కల్టివేషన్ రైట్స్ సీసీఆర్‌సీ) సర్టిఫికెట్ అందజేసి వారిని ఆదుకుంటున్నట్లు చెప్పారు. వ్యవసాయంలో మారుతున్న వాతావరణ మార్పుల్లో ప్రభుత్వం ఇస్తున్న ప్రోత్సాహకానికి సీసీఆర్‌సీ ఎంతో ఉపయోగకరమన్నారు. తొలకరి వర్షాలకు ముందస్తుగా రైతులకు అందుబాటులో నాణ్యమైన విత్తనాలు ఉన్నాయని, ఆర్‌బీకేల్లో నగదు చెల్లించి రసీదు పొంది విత్తనాలు తీసుకోవాలని కోరారు. పశుసంవర్థక శాఖ వైద్యుడు రాంబాబు మాట్లాడుతూ వైఎస్సార్ పశు బీమాలో 80 శాతం సబ్సిడీ, 20 శాతం రైతు వాటా చెల్లించాల్సి ఉందన్నారు. ఎస్సీ, ఎస్టీ, బీపీఎల్ రైతులు ఈ అవకాశాన్ని ఉపయోగించుకోవాలని చెప్పారు. ప్రకృతి సాగు ఇన్‌చార్జి పి. నరసింహులు మాట్లాడుతూ ఆరంభం నుంచి ప్రకృతి సాగు విధానాలతో బహుళ ప్రయోజనాలు ఉన్నాయన్నారు.

దొనకొండ (తాళ్లూరు): రైతుల కోసం జగనన్న ప్రభుత్వం అన్ని విధాలా సహకరిస్తోందని మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ గుమ్మ వెంకటేశ్వర్లు అన్నారు. దొనకొండ వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో శుక్రవారం మండల వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. వ్యవసాయాధికారి లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌లో కావాల్సిన విత్తనాలు సబ్సిడీపై అందిస్తున్నట్లు చెప్పారు. ఏపీఎం వెంకటేశ్వర్లు మాట్లాడారు.

### నేడు విద్యుత్ నిలిపివేత

అర్ధవీడు (కంభం): మండలంలోని ఎంహెచ్‌పురంలో 33కేవీ లైన్లో రైల్వేకు సంబంధించిన కేబుల్ పనుల కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కంభం డీఈ ఎస్.బాల అంకయ్య తెలిపారు.

### చలివేంద్రాలు కొనసాగించాలి

కొనకనమిట్ల: వేసవి దృష్ట్యా గ్రామ పంచాయతీల ఆధ్వర్యంలో సచివాలయాల వద్ద ఏర్పాటు చేసిన మంచినీటి చలివేంద్రాలను కొనసాగించాలని ఎంపీడీఓ శ్రీనివాసమూర్తి ఆదేశించారు. శుక్రవారం గొట్లగట్టుసచివాలయాన్ని సందర్శించి సిబ్బందితో మాట్లాడారు.

# నిలువ నీడనిచ్చిన దేవుడు జగనన్న

కురిచేడు: ప్రతి మనిషికి కూడు, గూడు తప్పనిసరి. పగలంతా ఎంత కష్టపడినా సాయంత్రానికి సొంత గూటికి చేరాలని ఉంటుంది. మనిషి తిన్నా..తినకున్నా తలదాచుకునేందుకు బెత్తెడు చోటు చాలంటారు పెద్దలు. సొంతింట్లో నివసిస్తే ఆ ఆనందమే వేరు. అలాంటి అవకాశం చాలామందికి కలగానే మిగిలిపోతోంది. బతుకు పోరాటంలో చాలామంది సొంతింటి కలను నేరవేర్చుకోలేకపోతున్నారు. అలాంటి సొంతిల్లు లేక అద్దెలకు ఉంటూ అవసాన దశలో ఎవరూ ఇల్లు అద్దెకు కూడా ఇవ్వక దేవాలయాల వద్ద, సత్రాల వద్ద తలదాచుకునే వారు కోకొల్లలు. అలాంటి వారి దీనగాథలు వినడంతో పాటు కళ్లారా చూసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పేదలందరికీ ఇళ్లు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారు. ఇక ఇల్లు కట్ట లేమనుకునే ప్రతి పేదవాడి ముఖంలో చిరునవ్వు చూడాలని సీఎం తపిస్తున్నారు. అలాంటి మహోన్నత వ్యక్తి చరిత్రలో నిలిచిపోతాడని ప్రజలు కీర్తిస్తున్నారు. నిలువ నీడనిచ్చిన దేవుడు జగనన్న.. అంటూ పేదలు కొనియాడుతున్నారు.



గంగదొనకొండ లేఔట్‌లో పూర్తయిన ఇల్లు



నా పేరు గుడిపాటి సుబ్బరత్నమ్మ. నన్ను నా తల్లిదండ్రులు బయ్యవరంలో గుడిపాటి తులశయ్యకు ఇచ్చి వివాహం చేశారు. నాకు కుమార్తె ఉంది. నా భర్త గుండెపోటుతో 14 ఏళ్ల క్రితం చనిపోయాడు. నేను నా కుమార్తెను తీసుకుని పుట్టింటికి చేరా. కూలినాలి చేసుకుని నా తల్లిదండ్రుల వద్ద తలదాచుకుంటున్నాను. కొంతకాలం తర్వాత తల్లిదండ్రులు వద్దనడంతో వేరే చోట అద్దెకు ఇల్లు తీసుకుని ఉంటున్నా. కూలి డబ్బులతో ఇల్లు కట్టుకునే స్థోమత లేదు. నాకు ఐదుగురు తోబుట్టువులు ఉన్నా పట్టించుకోలేదు. ఆ సమయంలో జగనన్న తోబుట్టువులా వచ్చి నాకు ఇంటి స్థలం, ఇల్లు ఇచ్చాడు. నేను నా సొంతింట్లో ఉంటూ కూలి పనులకు వెళ్లి బతుకుతున్నా. జగనన్నే ఇల్లు ఇవ్వకుంటే జీవితాంతం అద్దె ఇంట్లో తలదాచుకోవాల్సి వచ్చేది. జీవితాంతం జగనన్నను గుండెల్లో పెట్టుకుంటా.

= గుడిపాటి సుబ్బరత్నమ్మ,
గంగదొనకొండ



నాపేరు పల్లె సంజీవకుమారి. మాది పడమర నాయుడుపాలెం. నాకు ఇద్దరు కుమార్తెలు, నా భర్త చినకోటయ్య. బేల్దారి పనులు చేసేవాడు. ఆరేళ్ల క్రితం చనిపోయాడు. నేను కూలి పనులు చేసుకుంటూ పిల్లలను చదివించుకుంటున్నాను. ఉండేందుకు ఇల్లు లేదు. సెంటు భూమి లేదు. నాకు దేవుడిలా జగనన్న వచ్చి ఇల్లు ఇచ్చాడు. ఆ ఇల్లు కట్టుకుని నేను, నా పిల్లలు సంతోషంగా ఉంటున్నాం. జగనన్న ఇల్లు ఇవ్వకపోతే నాకు జీవితాంతం ఇల్లు కట్టుకొనే స్థోమత వచ్చేది కాదు. నేను ఉన్నంత కాలం జగనన్న ఇచ్చిన ఇంట్లో ఆయన్ను తలుచుకుంటూ జీవిస్తా. నాకు సొంతింటి కల జగనన్న ద్వారా నెరవేరింది. నా సొంత అన్నలు చేయలేనిది జగనన్న చేశాడు. చాలా సంతోషంగా ఉంది. నేను బతికినంతకాలం జగనన్న మేలు మరచిపోను.

= పల్లె సంజీవకుమారి,
పడమర నాయుడుపాలెం



ఆవులమంద లేఔట్‌లో నిర్మాణంలో ఉన్న ఇల్లు

**దర్శి నియోజకవర్గంలో 5,321 ఇళ్లు**

దర్శి నియోజకవర్గంలో మొత్తం 5,321 ఇళ్లు మంజూరయ్యాయి. ప్రస్తుతం వివిధ నిర్మాణ దశల్లో 5,284 ఇళ్లు ఉన్నాయి. 37 ఇళ్లు మాత్రమే ఇంత వరకూ ప్రారంభం కాలేదు. పూర్తయిన ఇళ్లు 1,554. బీబీఎల్ 2,206, బీఎల్ 1,012, రూఫ్ లెవల్ 316, ఆర్సీ లెవల్ 196, జగనన్న లేఔట్‌ల్లో 2078, సొంత స్థలాల్లో 3,243 ఇళ్లు మంజూరయ్యాయి. దర్శిలో 1341 ఇళ్లు, దర్శి అర్బన్‌లో 954 ఇళ్లు దొనకొండలో 1276 ఇళ్లు, కురిచేడు మండలంలో 779 ఇళ్లు, ముండ్లమూరు మండలంలో 537 ఇళ్లు, తాళ్లూరు మండలంలో 434 ఇళ్లు చొప్పున మంజూరయ్యాయి.

### దోమలను నివారిస్తే వ్యాధుల నుంచి రక్షణ

కొమరోలు: దోమలను నివారించి వ్యాధుల నుంచి రక్షణ పొందవచ్చని డబ్ల్యూహెచ్‌ఓ కన్సల్టెంట్ రాష్ట్ర కో ఆర్డినేటర్ పి.కొండారెడ్డి అన్నారు. మలేరియా మాసోత్సవాల సందర్భంగా కొమరోలు ప్రభుత్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రంలో శుక్రవారం వ్యాధులపై అవగాహన కార్యక్రమం, ర్యాలీ నిర్వహించారు. కొండారెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై ఏఎన్‌ఎంలు, ఆశ కార్యకర్తలకు మలేరియా నివారణపై పలు సూచనలు, సలహాలు అందచేశారు. కొండారెడ్డి మాట్లాడుతూ ముఖ్యంగా దోమలతో మలేరియా వ్యాధి సోకుతుందని, దోమలను పరిసరాల్లో లేకుండా నిర్మూలించాలని తెలిపారు. నివాస ప్రాంతాల్లోని పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా చూడాలన్నారు. నీటి నిల్వలు ఉండే పరిసరాల్లో ప్రతి శుక్రవారం ప్రజలకు అవగాహన కార్యక్రమాలు ఏర్పాటు చేయాలన్నారు. ఇంటి ఆవరణలో కిటికీలకు, తలుపులకు దోమలు రాకుండా జాలీ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. చీకటి పడే సమయంలో తలుపులు, కిటికీలు మూసివేస్తే దోమలను నివారించవచ్చన్నారు. దోమకాటుకు గురికాకుండా శరీరాన్ని జాగ్రత్త పరచుకోవాలన్నారు. జెట్, మస్కిటో వంటి వాటిని ఉపయోగించాలన్నారు. వైద్యాధికారులు డాక్టర్ చైతన్యదీపక్, డాక్టర్ పి.అశోక్, హెల్త్‌సూపర్‌వైజర్ కె.సౌజన్య పాల్గొన్నారు.

### ఇళ్ల నిర్మాణాలు వేగవంతం చేయాలి

ముండ్లమూరు: జగనన్న కాలనీలు మంజూరైన లబ్ధిదారులు ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలని హౌసింగ్ డీఈ నిరీక్షణరావు సూచించారు. స్థానిక హౌసింగ్ కార్యాలయంలో శుక్రవారం ఆయన సిబ్బందితో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 534 మందికి జగనన్న కాలనీలు మంజూరైనట్లు తెలిపారు. ఇందులో 190 మంది ఇంటి నిర్మాణాలు పూర్తి చేసుకున్నారని తెలిపారు. మిగిలిన వారు వీలైనంత త్వరగా పూర్తి చేసుకుంటే బిల్లులు వెంటనే చెల్లిస్తామని చెప్పారు. గ్రామీణ పథకం ద్వారా 833 మందికి ఇళ్లు మంజూరైనట్లు తెలిపారు. వారిలో 181 మంది నిర్మాణాలు వేగవంతంగా జరుగుతున్నాయని తెలిపారు. 652 మంది పనులు మొదలు పెట్టాల్సి ఉందన్నారు. ఇళ్ల నిర్మాణం ప్రారంభించిన వారు సమాచారం ఇస్తే రూ.40 వేలు అడ్వాన్స్‌గా ఇస్తామని చెప్పారు. అదనంగా ఉపాధి హామీ పథకం ద్వారా రోజుకు 292 రూపాయలు చొప్పున 90 రోజుల వేతనం చెల్లిస్తామని చెప్పారు. ఈ అవకాశాన్ని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆయన వెంట ఏఈ హనుమంతరావు, సిబ్బంది చెన్నకేశవులు ఉన్నారు.

### ప్రభుత్వ పథకాలపై అవగాహన ఉండాలి

కురిచేడు: దళిత మహిళలకు సంక్షేమ, అభివృద్ధి పథకాలపై మండలంలోని అలవలపాడులో శుక్రవారం అవగాహన సదస్సు దళిత బహుజన రిసోర్స్ కో ఆర్డినేటర్ నాగమణి అధ్యక్షతన నిర్వహించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పంచాయతీ కార్యదర్శి శివలింగమ్మ సూచించారు. ఉన్నతి, ఆసరా, స్త్రీనిధి, చేదోడు, అమ్మఒడి, విద్యాదీవెన, విద్యావసతి వంటి పథకాలు సద్వినియోగం చేసుకొని ఆర్థికంగా అభివృద్ధి చెందాలన్నారు. చిరు వ్యాపారులు చిన్న చిన్న యూనిట్లు పెట్టుకుని అభివృద్ధిలోకి రావాలని ఆమె సూచించారు. రేషన్‌కార్డు, ఆధార్ కార్డులో లేనటువంటి వారు హౌస్ మ్యాపింగ్ చేయించుకోవాలని వెల్ఫేర్ అసిస్టెంట్ నాగమూర్తి తెలిపారు. సీహెచ్‌ఓ రత్నకుమారి ఉన్నారు.

### పూర్వ విద్యార్థుల చేయూత

కురిచేడు: మండలంలోని పొట్లపాడు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2022–23 విద్యా సంవత్సరంలో ఉన్నత మార్కులు సాధించిన విద్యార్థులకు పూర్వ విద్యార్థులు చేయూత అందించారు. ఈ సందర్భంగా ప్రధానోపాధ్యాయురాలు బుల్లెమ్మ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు పూర్వ విద్యార్థులు చేయడం అభినందనీయమని, వీటిని విద్యార్థులు ప్రేరణగా తీసుకొని మంచిగా చదువుకొని ఉన్నత స్థానాలు అధిరోహించాలని కోరారు. మొదటి స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.5 వేలు, మూడో స్థానంలో నిలిచిన విద్యార్థికి రూ.2500 నగదు బహుమతి అందించారు. పూర్వ విద్యార్థులు రమాదేవి, కోటేశ్వరరావు, నిమ్మయ్య, అంకయ్య, ఎర్రయ్య, ఉపాధ్యాయులు జన్ను రవికుమార్, ఏపీ టీచర్స్ ఫెడరేషన్ నాయకులు ఖాజారహంతుల్లా, ఎస్‌వీఎల్ సుబ్బారావు పాల్గొన్నారు.

### ధ్వజారోహణతో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

మార్కాపురం టౌన్: పట్టణంలోని కంభం రోడ్డులో భూనీల సమేత ప్రసన్న వెంకటేశ్వరస్వామి దేవస్థానం పంచమ బ్రహ్మోత్సవాలు శుక్రవారం ధ్వజారోహణంతో ప్రారంభమయ్యాయి. విష్ణు సహస్రనామార్చన, విశ్వక్సేన ఆరాధన, అంకురార్పన తదితర పూజలు నిర్వహించారు. స్వామివారు శేషవాహనంపై భక్తులకు దర్శనమిచ్చారు. ఆలయ చైర్మన్ రామారావు, అదనపు కార్యదర్శి రమేష్ తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. శనివారం స్వామివారి కళ్యాణం నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

### వైభవంగా తిరుమలనాథస్వామి రథోత్సవం

పెద్దారవీడు: మండలంలోని రాజంపల్లిలో వెలసిన ప్రముఖ పుణ్యక్షేత్రం శ్రీదేవి భూదేవి సమేత తిరుమనాథస్వామి బ్రహ్మోత్సవాలు అట్టహాసంగా సాగుతున్నాయి. ఉత్సవాల్లో ప్రధాన ఘట్టమైన రథోత్సవం శుక్రవారం అంగరంగ వైభవంగా జరిగింది. తిరుమలనాథస్వామి నామస్మరణతో ఆలయం ప్రాంగణం మార్మోగింది. అర్చకులు భవానిప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీదేవి భూదేవి సమేత శ్రీగొడ్రాలికొండ తిరుమలనాథస్వామిని పట్టువస్త్రాలు, అభరణాలు, పూలమాలతో ప్రత్యేకంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్వామి వారు రథంపై ఆశీనులయ్యారు. ఉభయదాతలుగా మార్కాపురం పట్టణానికి చెందిన కందుల నారాయణరెడ్డి దంపతులు వ్యహరించారు. నలుమూలల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చి స్వామిని దర్శించుకుని మొక్కులు చెల్లించి తీర్థప్రసాదాలు స్వీకరించారు. మూడు రోజులు భక్తుల దాహార్తి తీర్చేందుకు మినరల్ వాటర్‌ను చట్లమిట్ల గ్రామానికి చెందిన బోర్ మెకానిక్ కందుల వెంకటరెడ్డి ఏర్పాటు చేశారు. అన్ని కులాల సత్రాల్లో అన్నదానం చేశారు. రాత్రికి వైఎస్సార్ సీపీ ఆధ్వర్యంలో విద్యుత్‌ప్రభ ఏర్పాటు చేశారు.

### పంటలు పండాలని పాదయాత్ర

గిద్దలూరు రూరల్: గిద్దలూరు వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్ పుట్టిన రోజు సందర్భంగా గిద్దలూరు గాంధీ బొమ్మ సెంటర్‌లోని వినాయకస్వామి దేవస్థానం నుంచి భీమలింగేశ్వర దేవస్థానం వరకు శుక్రవారం పాదయాత్ర చేశారు. వాసవీ క్లబ్ రీజినల్ చైర్మన్ మాగులూరి శ్రీకాంత్ మాట్లాడుతూ రైతులకు పంటలు బాగా పండాలని కోరారు. జిల్లా వైస్ గవర్నర్ కందగట్ల వెంకటరమణ, జోన్ చైర్మన్ ముప్పూరి రాజేశ్వరి, యూత్ క్లబ్ ప్రెసిడెంట్ సూరే నాగేశ్వరరావు, ప్రెసిడెంట్ చంద్రశేఖర్, వనిత, కటకం లక్ష్మి, రవికుమార్, అల్లురయ్య, ప్రవీణ్, వేణుమాధవ్ పాల్గొన్నారు.

### డంపింగ్ యార్డుకు ఫెన్సింగ్ వేయించాలి

కురిచేడు: డంపింగ్ యార్డుకు ఫెన్సింగ్ వేసి పరిశుభ్రంగా ఉంచాలని ఈఓఆర్డీ ఆర్‌వీఎస్ ప్రసాదరావు సూచించారు. ఫ్రైడే డ్రైడే సందర్భంగా ఆయన స్థానిక సచివాలయాన్ని శుక్రవారం సందర్శించారు. సిబ్బందికి తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ముఖ్యంగా శానిటేషన్, డ్రింకింగ్ వాటర్, స్ట్రీట్ లైట్లపై సమీక్ష నిర్వహించి ఆధార్ సెంటర్‌ను పరిశీలించారు. అనంతరం డంపింగ్ యార్డును పరిశీలించారు. క్లాప్ మిత్రలకు సెగ్రిగేషన్ ,వర్మీకంపోస్టు తయారు చేయటం గురించి వివరించారు. చల్లదనం కోసం తీగజాతి మొక్కలు పెంచాలని ఆదేశించారు. సచివాలయం1,2 కార్యదర్శులు చాంద్‌బీ, కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారుల దాడులు

త్రిపురాంతకం: విద్యుత్ శాఖ విజిలెన్స్ అధికారులు శుక్రవారం దాడులు నిర్వహించి 77 కేసులు నమోదు చేశారు. మండలంలోని పలు గ్రామాల్లో విద్యుత్ అక్రమ వాడకందారులపై అధికారులు కొరడా ఝులిపించారు. 77 మందిపై కేసులు నమోదు చేసి 2,28,700 రూపాయలు అపరాధ రుసుం వసూలు చేసినట్లు తెలిపారు. దాడుల్లో విజిలెన్స్ డీఈ హైమావతి, ఏడీఈ వి. శ్రీనివాసరావు, ఏఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

### రీ సర్వేపై రైతులకు అవగాహన పెంచాలి

ముండ్లమూరు: గ్రామాల్లో జరుగుతున్న భూముల రీసర్వేపై రైతులకు అవగాహన కల్పించాలని రీసర్వే డీటీ రవికాంత్ అన్నారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం వీఆర్వోలు, రీసర్వే బృందాలతో ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలోని 17 గ్రామాల్లో రీ సర్వే జరుగుతోందన్నారు. ఆయా గ్రామాల్లో సర్వే ముందు రోజు సంబంధిత రైతులకు తప్పకుండా సమాచారం ఇవ్వాలన్నారు. రెవెన్యూ రికార్డుల ఆధారంగానే సర్వే పూర్తి చేస్తున్నట్లు రైతులకు తెలియాలన్నారు. ప్రతి రైతు తమ వద్ద ఆధార పత్రాలను సర్వే సభ్యులకు తెలియజేయాలన్నారు. సర్వే పూర్తి చేసిన భూమి వివరాలు వెంటనే ఆన్‌లైన్ చేయాలని సూచించారు. సంబంధిత రైతులకు 92 నోటీసు జారీ చేయాలన్నారు. డీటీ పుల్లారెడ్డి, వీఆర్వోలు పాల్గొన్నారు.

### పలకల పరిశ్రమకు చేయూతనివ్వాలి

మార్కాపురం: అంతర్జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన మార్కాపురం పలకల పరిశ్రమకు పూర్వ వైభవం తెచ్చేందుకు చేయూతనివ్వాలని రాజ్యసభ సభ్యుడు, వైఎస్సార్ సీపీ అనుబంధ విభాగాల అధ్యక్షుడు విజయసాయిరెడ్డిని ఆ పార్టీ వాణిజ్య విభాగం జిల్లా అధ్యక్షుడు తడికమళ్ల బాలసుబ్బారావు కోరారు. ఈ మేరకు శుక్రవారం తాడేపల్లిలో పార్టీ అనుబంధ విభాగాల కమిటీ ప్రతినిధుల సమావేశంలో విజయసాయిరెడ్డికి వినతి పత్రాన్ని అందజేశారు. పలకల పరిశ్రమలకు ప్రోత్సాహకాలు ఇవ్వాలని విజ్ఞప్తి చేశారు.

### 12 నుంచి గడప గడపకు మన ప్రభుత్వం

కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు గ్రామ సచివాలయం పరిధిలో ఈ నెల 12 నుంచి మూడు రోజులపాటు ఎమ్మెల్యే కేపీ నాగార్జునరెడ్డి ఆధ్వర్యంలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ అద్దంకి శ్రీనివాసమూర్తి తెలిపారు. శుక్రవారం వాగుమడుగులో గ్రామ సచివాలయ ఉద్యోగులు, వలంటీర్లతో సమీక్ష నిర్వహించారు. వాగుమడుగు, రేగడపల్లి, బోడపాడు, అంబాపురం, గనివానిపాడు గ్రామాల్లో ఎమ్మెల్యే పర్యటిస్తారని, కార్యక్రమం ఉద్దేశాన్ని ప్రజలకు ముందుగా వివరించాలని సూచించారు. సమావేశంలో ఈఓఆర్డీ జనార్దన్, ఆయా గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

### నేటి నుంచి రామచంద్రస్వామి ఆలయ ప్రతిష్ఠ ఉత్సవాలు

కొనకనమిట్ల: మండలంలోని తువ్వపాడు(దక్షిణంపల్లి) గ్రామంలో శనివారం నుంచి ఐదు రోజుల పాటు సీతాలక్ష్మణ హనుమత్ సహిత రామచంద్రస్వామి నూతన ఆలయ ప్రతిష్ఠ మహోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

## ఎడ్ల పందేలను ప్రారంభించిన ఎమ్మెల్యే అన్నా

అర్ధవీడు (కంభం): మండలంలోని మోహిద్దీన్‌పురంలో శివాలయం ధ్వజస్తంభం ప్రతిష్ఠ, తిరునాల మహోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు ఎడ్ల పందేలను ప్రారంభించారు. తొలుత శివాలయంలో నిర్వహించిన ప్రత్యేక పూజ కార్యక్రమాల్లో ఆయన పాల్గొన్నారు. అర్చకులు అందించిన తీర్థప్రసాదాలు స్వీకరించారు. అర్ధవీడు మాజీ ఎంపీపీ నన్నెబోయిన రవికుమార్ యాదవ్, మోహిద్దీన్‌పురం, బోగోలు సర్పంచ్‌లు కందుల రామకృష్ణారెడ్డి, డాక్టర్ చేగిరెడ్డి పోతిరెడ్డి, మోహిద్దీన్‌పురం వైఎస్సార్ సీపీ నాయకులు పాల్గొన్నారు.



ఎడ్లపందేలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే అన్నా

### జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలి

దొనకొండ (దర్శి టౌన్): జగనన్న గృహ నిర్మాణాలు వేగవంతం చేయాలని జిల్లా పంచాయతీ అధికారి జీవీ నారాయణరెడ్డి కోరారు. దొనకొండ మండలం పోలేపల్లి పంచాయతీలో పేదలందరికీ ఇళ్లు కార్యక్రమంలో భాగంగా చేపట్టిన నివాసాల నిర్మాణాలను ఆయన శుక్రవారం పరిశీలించారు. లబ్ధిదారులకు మెటీరియల్, బిల్లులు త్వరగా అందేలా తగిన చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. ఆ తర్వాత ఫ్రైడే డ్రైడే కార్యక్రమం పరిశీలించారు. దోమల వ్యాప్తిని అరికట్టేందుకు మురుగు నీటి నిల్వలు ఉన్న చోట ఆయిల్ బాల్స్ రిలీజ్ చేశారు. ఎస్సీ కాలనీలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి భోజనం రుచి చూశారు. చెత్త సంపద కేంద్రాన్ని పరిశీలించారు. ఎస్‌డబ్ల్యూపీసీ ఆవరణలో అల్లుకునే చెట్లు నాటాలని సూచించారు. తీగ జాతి మొక్కలు నాటారు. ఈఓఆర్డీ డేవిడ్, కార్యదర్శులు పాల్గొన్నారు.

### రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలి

మార్కాపురం టౌన్: రైతులకు ప్రభుత్వ పథకాలు అందేలా చూడాలని ఎంపీపీ పి.అరుణచెంచిరెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న ఎంపీపీ మాట్లాడుతూ.. రైతు భరోసా కేంద్రాల్లో ఎరువులు, విత్తనాలు కొరత లేకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఏఓ శ్రీనివాసులు పాల్గొన్నారు.

### జాబ్ మేళాలో 52 మంది ఎంపిక

మార్కాపురం: మార్కాపురంలోని సాధన డిగ్రీ కళాశాలలో బుధవారం నిర్వహించిన జాబ్ మేళాలో 52 మంది వివిధ ఉద్యోగాలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ కే మధుసూదన్ తెలిపారు. ఐసీఐసీఐ బ్యాంక్, టీవీఎస్ ట్రైనింగ్ అండ్ సర్వీసెస్ సంస్థ వారు నిర్వహించిన క్యాంపస్ సెలెక్షన్స్‌లో మొత్తం 337 మంది రిజిస్ట్రేషన్ చేసుకోగా 210 మంది హాజరయ్యారని, వీరిలో 52 మందిని వివిధ ఉద్యోగాలకు కంపెనీ ప్రతినిధులు ఎంపిక చేశారని వివరించారు. హెచ్‌ఆర్ ప్రతినిధులు బీఆర్ కిరణ్, కేవీఎస్ఆర్ పవన్‌కుమార్, వైస్ ప్రిన్సిపాల్ పి.శ్రీధర్ మాట్లాడుతూ.. ఎంపికైన వారికి 21 రోజులపాటు బ్యాంక్ కార్యకలాపాలపై శిక్షణ ఇస్తామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్లు రాజగోపాల్‌రెడ్డి, కృష్ణరెడ్డి, రమేష్‌బాబు, వీఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

### మట్టి ఖర్చులు అందజేత

గిద్దలూరు రూరల్: గిద్దలూరు నగర పంచాయతీలోని కోటగడ్డ సచివాలయం పరిధిలో శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందిన షేక్ శాబీరాకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశ పెట్టిన వైఎస్సార్ బీమా పథకం కింద రూ.లక్ష రూపాయలు మంజూరైంది. నగర పంచాయతీ కమిషనర్ వై.రామకృష్ణయ్య ఆదేశాల మేరకు ముందుగా మట్టి ఖర్చుల కోసం 10 వేల రూపాయలను వైఎస్సార్ సీపీ నాయకుడు ముద్దర్ల శ్రీనివాసులు చేతులు మీదుగా మృతి చెందిన షాబిరా భర్త చిన్న మాబుకు అందజేశారు. వార్డు వైల్ఫేర్ సెక్రటరి కర్నాటి మాధవరెడ్డి, హ్యూమన్ రైట్స్ ప్రతినిధి షేక్ ఖాజా హుస్సేన్, పుల్లయ్య పాల్గొన్నారు.

### శ్రీవారికి వెండి కిరీటాల బహూకరణ



కొనకనమిట్ల: మండలంలోని వాగుమడుగు పంచాయతీ రేగడపల్లి గ్రామం వెంకటేశ్వరస్వామి ఆలయంలో భూదేవి, శ్రీదేవి సమేత వెంకటేశ్వరస్వామికి దాతలు రజత మకుటాలు, వెండి కిరీటాలు బహూకరించారు. గ్రామానికి చెందిన పాతకోట అంజిరెడ్డి, రమణమ్మ, పాతకోట బాబూజీరెడ్డి, హైమవతి దంపతులు వెండి కిరీటాలు బహుకరించినట్లు ఆలయ అర్చకులు స్వాములు విజయకాంత్‌శర్మ, కమిటీ నిర్వాహకులు పాతకోట శ్రీనివాసులరెడ్డి తెలిపారు. శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు.

### ఉద్యోగ భద్రత కల్పించాలి

పెద్దదోర్నాల: పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య పథకంలో పని చేస్తున్న ఆరోగ్య మిత్రలను కాంట్రాక్ట్ సర్వీస్‌లోకి మార్చి వారికి ఉద్యోగ భద్రత కల్పించాలని ఏపీజీఈఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు కాకర్ల వెంకట రామిరెడ్డిని దళిత ఎంప్లాయీస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు శుక్రవారం కలిశారు. తాడేపల్లిలోని ఆయన కార్యాలయంలో కలిసిన నాయకులు ఆరోగ్యమిత్రల సమస్యలు వివరించారు. ఆరోగ్యమిత్రలను కాంట్రాక్ట్ విధానంలోకి తీసుకుని వారికి జీతాలు పెరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు. వెంకటరామిరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి ఆరోగ్యమిత్రల సమస్యలు తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అనంతరం మేడ్ రాష్ట్ర అధ్యక్షుడు మురికిపూడి దేవపాల్‌ను కలిసి తమ సమస్యలు వివరించారు. ఎస్సీ,ఎస్టీ ఆరోగ్యమిత్రల సంఘ రాష్ట్ర అధ్యక్షుడు మాచర్ల బుజ్జి, ప్రధాన కార్యదర్శి దర్శనం రాంబాబు ఉన్నారు.

### గర్భిణులు పోషకాహారం తీసుకోవాలి

రాచర్ల: గర్భిణులు పోషకాహారం తీసుకోవాలని ఆకవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ షేక్ ఖాదర్‌బాష సూచించారు. ప్రధానమంత్రి సురక్ష మాతృత్వ అభియాన్ కార్యక్రమంలో భాగంగా ఆకవీడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో డాక్టర్ షేక్ ఖాదర్ బాష, డాక్టర్ జి.కరుణ అధ్వర్యంలో 26 మంది గర్భిణులకు ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వారికి కావాల్సిన మందులు పంపిణీ చేశారు. సర్పంచ్ తలపాటి దేవదానం, హెచ్‌ఈవో విజయ్, వైద్యశాల సిబ్బంది అంజనీదేవి, ఆర్.పిచ్చమ్మ పాల్గొన్నారు.

### అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు

తాళ్లూరు: ఉద్యోగులు అంకిత భావంతో పనిచేస్తే ప్రజల్లో మంచి గుర్తింపు వస్తుందని, అందుకు ఇన్‌చార్జి ఈఓఆర్డీ ఎన్‌యూ ప్రసన్నకుమార్ పనితీరే నిదర్శనమని వక్తలు అన్నారు. బదిలీపై వెళ్లిన ఇన్‌చార్జి ఈఓఆర్డీ ప్రసన్నకుమార్, ఏపీఓ కళ్యాణి దంపతులను స్థానిక సచివాలయంలో శుక్రవారం ఘనంగా సన్మానించారు. కార్యదర్శిగా ప్రసన్నకుమార్ అందుబాటులో ఉంటూ ప్రజల సమస్యలు పరిష్కరించారని సర్పంచి మేకల చార్లేస్ సర్జన్ కొనియాడారు. ఏఓ ప్రసాదరావు, వైద్యాధికారి ఖాదర్‌మస్తాన్‌బీ, ఎంఈఓ సుబ్బయ్య పాల్గొన్నారు.

**కోర్టువారి ఉత్తర్వుల మేరకు దావా సమను**

మహా రాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
OS.No : 7/2021
బెల్లంకొండ విజయలక్ష్మీ ... వాది
VS
మంచికంటి శ్రీనివాసరావు ... ప్రతివాది
తండ్రి సుబ్బారాయుడు
శ్రీ పద్మావతి జ్యూవలరీస్, నివాసం D.No. 6-41, నక్కావారివీధి, బేస్తవారిపేట (Post & Mandal) ప్రకాశం జిల్లా.

పై దావానెంబర్‌లో దావా సమన్సు ప్రతివాది తీసుకోనందున కోర్టువారి ఉత్తర్వుల ప్రకారం సాక్షి దిన పత్రికలో ప్రకటించడమైనది. ప్రతివాది 30.06.2023 ఉదయం 10:30 గంటలకు మీరుకాని, లేక మీ అడ్వకేట్ ద్వారా కాని, మీకున్న అక్షేపనలు తెలియజేయగలరు. మీరుగాని మీ అడ్వకేట్ గారు కాని పైన తేది వాయిదా రోజున ఏ విధమైన అభ్యంతరములు తెలియజేయని ఎడల కోర్టువారు మీ పరోక్షమందు ఉత్తర్వులు వాదికి అనుకూలంగా పాలించగలరని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా 30.06.2023
ఇట్లు : నామా సుబ్బారావు, M.A., B.L.
వాది తరుపు అడ్వకేటు,
మార్కాపురం. 523316, ప్రకాశం జిల్లా.

**కోర్టువారి ఉత్తర్వుల మేరకు నోటీసు**

మహా రాజశ్రీ మార్కాపురం సీనియర్ సివిల్ జడ్జివారి కోర్టులో
I.A.No : 122/2021 in OS.No : 7/2021
బెల్లంకొండ విజయలక్ష్మీ ... Petitioner / వాది
VS
మంచికంటి శ్రీనివాసరావు
తండ్రి సుబ్బారాయుడు
శ్రీ పద్మావతి జ్యూవలరీస్, నివాసం D.No. 6-41, నక్కావారివీధి, బేస్తవారిపేట (Post & Mandal) ప్రకాశంజిల్లా.
... Respondent / ప్రతివాది

పై దావానెంబర్‌లో I.A.No. నోటీసులు Respondent / ప్రతివాది తీసుకోనందున కోర్టువారి ఉత్తర్వుల మేరకు సాక్షి దిన పత్రికలో ప్రకటించడమైనది. Respondent / ప్రతివాది 30.06.2023 ఉదయం 10:30 గంటలకు మీరుకాని, లేక మీ అడ్వకేట్ ద్వారా కాని మీకున్న ఆక్షేపనలు తెలియపరచగలరు. మీరుకాని, మీ అడ్వకేట్ గారు కాని పై తేది వాయిదా రోజున ఏ విధమైన అభ్యంతరములు తెలియజేయని ఎడల కోర్టువారు మీ పరోక్షమందు Petitioner / వాదికి అనుకూలంగా ఉత్తర్వులు పాలించగలరని ఇందు మూలంగా తెలియజేయడమైనది.

వాయిదా 30.06.2023
ఇట్లు : నామా సుబ్బారావు, M.A., B.L.
Petitioner / వాది తరుపు అడ్వకేట్,
మార్కాపురం, ప్రకాశం జిల్లా.